RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 360 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 2 జూలై 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## ఈ నెలలో తీసుకోనున్న ప్రభుత్వం

## ఇప్పటికే ఆర్బీఐకి అధికారుల విజ్ఞప్తి




### మిగతా నిధులు ఇతర మార్గాల్లో సమకూర్చుకోవాలని నిర్ణయం

## రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం

హైదరాబాద్ : రైతు రుణమాఫీకి అవసరమైన నిధుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. రుణమాఫీకి దాదాపు రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా, ఆ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు అందుబాటులో ఉన్న మార్గాలపై దృష్టిసారించింది. ఆగస్టు 15 కల్లా రుణమాఫీ చేస్తామని మాటిచ్చిన ప్రభుత్వం.. వచ్చే నెలలోనే ఈ ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా ముందుగానే పెద్ద మొత్తంలో నిధులు అందుబాటులో ఉంచుకోవాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో రెగ్యులర్‌గా ప్రతి నెల తీసుకునే అప్పుల మొత్తాన్ని కొంతమేర పెంచుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెలలో రూ.10 వేల కోట్లు అప్పు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు ఆర్బీఐని కూడా కోరినట్టు సమాచారం. ఇక రుణమాఫీకి అవసరమైన మిగతా నిధులను ఇతర ఆదాయ మార్గాల ద్వారా సమకూర్చుకోవాలని సర్కార్ భావిస్తున్నది. ప్రభుత్వ భూములను బ్యాంకుల్లో తనఖాపెట్టి లోన్లు తీసుకోవడంతో పాటు ప్రతినెల వచ్చే రాబడిలో కొంతమేర వినియోగించుకోవాలని అనుకుంటున్నది. ముఖ్యమైన పథకాల అమలుకు ఇబ్బంది లేకుండానే రైతు రుణమాఫీ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నది. అయితే, ఒకేసారి రూ.31 వేల కోట్లు సమకూర్చుకోవడం చిన్న విషయం కాదని ఆర్థిక శాఖ అధికారులు అంటున్నారు. ఓవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులకు కిస్తీలు, వడ్డీలు చెల్లించుకుంటూ.. ఇంకోవైపు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేయడం గొప్ప విషయమేనని పేర్కొంటున్నారు.

**అవసరమైతే మరో 5 వేల కోట్లు! :** ప్రస్తుతం అన్ని రాష్ట్రాల మాదిరే తెలంగాణ ప్రతి నెల ఆర్బీఐ నుంచి ఎఫ్ఆర్?బీఎం పరిధిలో అప్పులు తీసుకుంటున్నది. ఏడాది మొత్తానికి నిర్దేశించుకున్న అప్పుల్లో నుంచి నెలకు కొంత మొత్తం తీసుకుంటున్నది. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు రూ.60 వేల కోట్లు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే చాన్స్ ఉంది. ఇందులో ఇప్పటికే ప్రభుత్వం రూ.12 వేల కోట్లు తీసుకున్నది. అంటే మూడు నెలల్లో యావరేజ్‌గా ప్రతి నెల రూ.4 వేల కోట్లు తీసుకున్నది. ఈ లెక్కన మిగిలిన 9 నెలల్లో రూ.48 వేల కోట్ల మేర అప్పు చేసే అవకాశం రాష్ట్రానికి ఉన్నది. ప్రతి క్వార్టర్‌కు ఎంత మొత్తంలో అప్పు తీసుకుంటామనే దానిపై ఆర్బీఐకి ప్రభుత్వం ముందుగానే ఇండెంట్ ఇస్తుంది. జూన్‌తో ఫస్ట్‌క్వార్టర్ ముగియనుంది. రెండో క్వార్టర్?జులై నుంచి మొదలవుతుంది. దీంతో వచ్చే నెలలో రూ.10 వేల కోట్ల మేర అప్పు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇదే విషయాన్ని ఆర్బీఐకి ఆర్థిక శాఖ అధికారులు విన్నవించినట్టు తెలుస్తున్నది. అవసరమైతే జులై చివర్లో లేదా ఆగస్టు మొదటి వారంలో మరో రూ.5 వేల కోట్లు కూడా ఆర్బీఐ నుంచే తీసుకోవాలనే ప్లాన్ ఉన్నది. వీటన్నింటినీ రుణమాఫీకి ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. ఇవి కాకుండా ప్రభుత్వానికి వివిధ రకాలుగా వచ్చే సొంత ఆదాయాన్ని కూడా వాడుకోనుంది. ఇక భూముల తనఖా విషయంలోనూ ఆర్బీఐ గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ప్రైవేట్ బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో లోన్లు తీసుకోనుంది. ఇతర మార్గాల్లోనూ నిధులు సర్దుబాటు చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలు.... దమ్ముంటే రాజీనామా చేయాలి

జగిత్యాల: రేవంత్ రెడ్డి 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. డబ్బుల కోసమే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారారని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరడం అంటే.



బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన సంజయ్ కుమార్ దమ్ముంటే రాజీనామా చేసి పోటీకి రావాలని సవాల్ విసిరారు.

హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీలో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు.

## హతవిధి... ఆ వైభవం ఏమైంది?




తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని వరుస ఓటములు వెంటాడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో వరుస ఓటములతో క్యాడర్ డీలా పడింది. అయినా బీఆర్ఎస్ అగ్ర నేతలు మౌనంగా ఉండటంపై గులాబీ కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొంది. పార్టీ పరిస్థితిపై సమీక్షలు లేకపోవడంతో కింది స్థాయి నేతల్లో నిరూత్సాహం ఏర్పడింది. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల ముందు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ మారగా మరికొంతమంది ఎమ్మెల్యేలు అదే దారిలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ 39 స్థానాలతో ప్రతిపక్ష స్థానానికి పరిమితం అయింది. దీంతో తెలంగాణ భవన్ వేదికగా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించారు ముఖ్యనేతలు. పార్టీ కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. త్వరలోనే జిల్లా స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా నుంచి మండల స్థాయి వరకు పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని సన్నాహక సమావేశాల్లో చెప్పినా... కార్యరూపం దాల్చలేదు. ఈ లోగా తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని గులాబీ అధిష్టానం భావించింది. ఫలితాల తర్వాత బీఆర్ఎస్ కు ఒక్క సీటు దక్కలేదు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ సీట్లలో పోటీ చేసిన గులాబీ పార్టీ అన్ని స్థానాల్లోను ఓడిపోయింది. ఎనిమిది లోక్ సభ స్థానాల్లో డిపాజిట్లు దక్కలేదు. తన ఓట్ల శాతాన్ని సగానికి పైగా కోల్పోయింది. ఓటమి తర్వాత ఒక్క సారిగా బీఆర్ఎస్ సైలెంట్ అయింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమ పార్టీ ఓటమిపై ట్వీట్ కు మాత్రమే పరిమితం అయ్యారు. గులాబీ అధినేత కేసీఆర్ ఫలితాల తర్వాత ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యారు. దీంతో తెలంగాణ భవన్ కళ తప్పింది. ముఖ్య నేతలు ఎవరూ తెలంగాణ భవన్ కు రావడం లేదు. కార్యకర్తలుపార్టీ కార్యాలయం వైపు రావడం లేదనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిపై ఇప్పటి వరకు తెలంగాణ భవన్ వేదికగా సమీక్షలు లేకపోవడంపై బిఆర్ఎస్ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. తొలిసారి పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం కోల్పోయింది. దీంతో పార్టీని తిరిగి గాడిలో పెట్టాలంటే సమీక్ష చేయాలనే భావన వ్యక్తం అవుతోంది. అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులతో సమీక్ష ఏర్పాటు చేస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితులతో పాటుగా ఓటమికి కారణాలు తెలుసుకునే అవకాశం ఉంటుందనే భావన పార్టీ క్యాడర్ లో వ్యక్తం అవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ నిర్మాణంపై స్పెషల్ ఫోకస్ పెడతామని అధిష్టానం చెప్పింది. అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. పార్టీ కమిటీలన్నీ రద్దు చేసి, కొత్త కమిటీల నియామకం ద్వారా పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తామని అధిష్టానం హామీ ఇచ్చింది. పార్టీ ప్లినరీ నిర్వహించుకుని ఎన్నికలపై సమీక్షలు చేద్దామని అధినేత కేసీఆర్ చెప్పినప్పటికీ దీనిపై క్లారిటీ రాలేదు. అధికారంలో ఉన్నప్పుడు నిత్యం కార్యకర్తలతో సందడిగా ఉన్న బీఆర్ఎస్ కార్యాలయం వరుస ఓటములతో బోసిపోయింది. ఆ పార్టీ అగ్రనేతలు తెలంగాణ భవన్ వైపుకు రావడం లేదు.




## కొనేట్టు లేదు... తినేట్టు లేదు...!

### మార్కెట్‌లో మంట పుట్టిస్తున్న నిత్యావసరాలు

### పెరిగిన కూరగాయలు, ఉల్లి రేట్లు - తలకిందులవుతున్న వంటింటి బడ్జెట్

### పేద, మధ్యతరగతి వర్గాల జేబులకు చిల్లులు - 13 నెలల గరిష్ఠానికి టోకు ధరల సూచీ

న్యూఢిల్లీ : కొనబోతే కొరివే అన్నట్టు తయారైంది సగటు మనిషి బతుకు. కడుపునిండా కూడు లేక చాలీచాలని మెతుకులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నది సామాన్యులకు.

ఆదాయం అంతంతే ఉంటున్నదిగానీ.. ఖర్చులు అంతకంతకూ పెరిగిపోతున్నాయి మరి. వస్తువు ఏదైనా, ఉత్పత్తి ఏమైనా చూసి ఉసూరుమనడమే తప్ప.. కొని అక్కెర తీర్చుకునే అవకాశం లేక పేద, మధ్యతరగతి వర్గాలు కాలం వెళ్లదీస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు పుట్టిస్తున్న మంటలకు.. మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ద్రవ్యోల్బణం అధికారిక గణాంకాలే నిదర్శనం. హెూల్‌సేల్ మార్కెట్‌లో ధరలు (డబ్ల్యూపీఐ) ఏకంగా 13 నెలల గరిష్ఠాన్ని తాకుతూ గత నెల ఏప్రిల్‌లో 1.26 శాతంగా నమోదయ్యాయి. ఈ క్రమంలోనే రిటైల్ మార్కెట్‌లోనూ ఆహార ధరలు 8.70 శాతాన్ని చేరాయి. నిజానికి గత ఏడాది ఏప్రిల్‌లో 3.84 శాతంగానే ఉండటం గమనార్హం. ఇక నిరుడు ఏప్రిల్‌లో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 0.79 శాతంగా ఉన్నది. టోకు ఆహార ద్రవ్యోల్బణం 4 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 7.74 శాతంగా ఉన్నది.

**ఎండలు ఇలాగే ఉంటే..** ఈసారి ఎండలు దంచి కొడుతున్న విషయం తెలిసిందే. అయితే పెరుగుతున్న ఎండల తీవ్రత ఆయా ఆహార పంటలపై పెద్దగానే ప్రభావం చూపుతున్నది. దీంతో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక మార్కెట్‌లో ధరలకు రెక్కలు తొడుగుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది మార్చితో చూస్తే కూరగాయల ధరలు ఏప్రిల్‌లో 19.52 శాతం నుంచి 23.60 శాతానికి పెరిగాయి. ఆలుగడ్డ ధర 52.96 శాతం నుంచి 71.97 శాతానికి ఎగిసింది. ఉల్లిగడ్డ ధర 56.99 శాతం నుంచి 59.75 శాతం ఎగబాకింది.

**ముందుచూపేది..** ద్రవ్యోల్బణం వెనుక కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత్.. వర్షాధార పంటల దేశం. వర్షాలు ఏటా సమృద్ధిగా పడవు. కాబట్టి మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా ఆయా ఉత్పత్తుల నిల్వల్ని ఎప్పుడూ ఉంచాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. దీనివల్ల ధరలు స్థిరంగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. నిల్వలు లేకనే నిత్యావసరాలు, ముఖ్యంగా మెజారిటీ పప్పు దినుసుల కిలో ధర సగటున రూ.150 పలుకుతున్నదని పేర్కొంటున్నారు. నిరుడు జూలై, ఆగస్టు నెలల్లోనూ ఆహార ద్రవ్యోల్బణం 15.09 శాతం, 11.43 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నారు. ఈ వర్షాకాలంలో నిరాశే ఎదురైతే ధరల కట్టడి కష్టంగానే ఉంటుందని హెచ్చరిస్తున్నారు. మార్కెట్‌లో చాలా వస్తూత్పత్తుల ధరలు గత కొద్దినెలలుగా పెరుగుతూపోతున్నాయి. దీన్నిబట్టి మే, జూన్ నెలల్లో డబ్ల్యూపీఐ సూచీ 2 శాతాన్ని దాటేలా ఉన్నది. దీనివల్ల దేశ స్థూల ఆర్థిక వ్యవస్థ కూడా ప్రభావితం అవుతుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## చదువు కంటే పెళ్లి కోసమే భారత్ లో ఎక్కువ ఖర్చు

మన దేశంలో పెళ్లికి ఇచ్చే ప్రాధాన్యత ఎంతన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీని కోసం భారీగా ఖర్చు చేస్తుంటారు. భారత్ లో పెళ్లిళ్లకు ఎంత ప్రాధాన్యత ఇస్తారన్న విషయానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాల్ని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ జెఫ్రీస్ రిపోర్టు వెల్లడించింది. దీని ప్రకారం సగటు భారతీయులు చదువు కోసం వెచ్చిస్తున్న మొత్తం కంటే పెళ్లిళ్ల కోసం చేసే ఖర్చు ఎక్కువన్న విషయాన్ని ఈ రిపోర్టు స్పష్టం చేసింది. దేశంలో వివాహ పరిశ్రమ 130 బిలియన్ డాలర్లుగా పేర్కొంది. మన రూపాయిల్లో చెప్పాలంటే రూ.10 లక్షల కోట్లుగా అంచనా వేసింది. ప్రపంచ వ్యాప్తంగా వార్షికంగా అత్యధిక పెళ్లిళ్లు జరిగే దేశాల్లో మన దేశమే ముందు ఉండటం విశేషం. చైనాలో 70-80 లక్షల పెళ్లిళ్లు జరుగుతుండగా.. అమెరికాలో 20-25 లక్షల పెళ్లిళ్లు జరుగుతాయని పేర్కొన్నారు. మన దేశంలో మాత్రం 80 లక్షల నుంచి కోటి వరకు ప్రతి ఏటా పెళ్లిళ్లు జరుగుతాయని వెల్లడించింది. మన దేశంలో నిత్యవసర వస్తువుల తర్వాత అత్యధికంగా పెళ్లిళ్ల సందర్భంగా ఖర్చు చేస్తారని చెప్పింది. మన దేశంలో పెళ్లిళ్ల కోసం బంగారం..వెండి ఆభరణాలతో పాటు దుస్తుల కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. వాహనాలు.. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల అమ్మకాలకు పరోక్షంగా కారణమవుతాయని పేర్కొన్నారు. పెళ్లిళ్లలో అత్యధికంగా సంప్రదాయంగా జరగటంతో ఎక్కువ ఖర్చులకు కారణంగా చెప్పాలి. పెళ్లిళ్లు వారి ఆదాయాలు.. సంపదకు తగ్గట్లు కాకుండా అంతకు మించిన ఆడంబరంగా పెళ్లిళ్లను నిర్వహిస్తుంటారని నివేదిక పేర్కొంది. ఒక్కో పెళ్లి ఖర్చు రూ.12.5 లక్షలుగా ఉంటుందని.. ఇది తలసరి ఆదాయం కంటే చాలా ఎక్కువగా పేర్కొన్నారు. మనదేశంలో జరిగే పెళ్లిళ్లకు భిన్నంగా అమెరికాలో వివాహాలు ఉంటాయని వెల్లడించింది. మన దేశంలో స్కూల్.. గ్రాడ్యుయేషన్ కోసం వెచ్చించే ఖర్చు కంటే రెట్టింపు మొత్తాన్ని మన దేశంలో పెళ్లిళ్ల కోసం కుటుంబాలు ఖర్చు స్తుంటాయి. అమెరికాలో మాత్రం ఇందుకు భిన్నంగా విద్య కోసం ఖర్చు చేసే మొత్తంలో సగం మొత్తాన్ని మాత్రమే పెళ్లిళ్ల కోసం వినియోగిస్తున్నట్లు రిపోర్టు వెల్లడించింది. పెళ్లిళ్ల కోసం పనులను ఆరు నెలల నుంచి ఏడాది ముందు నుంచి ప్లాన్ చేస్తుంటారని.. గరిష్ఠంగా 50వేల మంది కూడా పెళ్లిళ్లకు హాజరవుతారని పేర్కొంది. పెళ్లి కుమార్తె ధరించే లెహంగాల బరువు కొన్నిసార్లు పది కేజీల వరకు ఉంటాయని చెప్పింది. అంతేకాదు.. మొత్తం ఆభరణాల అమ్మకాల్లో సగం పెళ్లి కుమార్తెలకు ఇచ్చే నగల కోసమే ఉంటాయని చెప్పింది. అలంకరణకు తక్కువ ఖర్చు చేస్తారని.. పెళ్లి వేడుక సందర్భంగా చాకోలేట్ పానీ పూరి.. వాఫిల్ దోస.. పైనాపిల్ ఫ్లేవర్డ్ పనీర్ లాంటి ఫుడ్ సర్వ్ చేయాలని ఎక్కువ మంది కోరుకుంటారని పేర్కొంది. మొత్తంగా పెళ్లిళ్లకు మన దేశంలో ఎంతటి ప్రాధాన్యత ఇస్తారన్న విషయం తాజా రిపోర్టు స్పష్టం చేసిందని చెప్పాలి.

## చరిత్ర ఉట్టి పడేలా అమర వీరుల స్మృతి వనం ఏర్పాటు

**అమర వీరుల స్తూపానికి పర్యటక శోభ**

**అమర వీరుల స్తూపం వద్ద స్మృతి వనం అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి ప్రారంభించిన జిల్లా ఇంచార్జి మంత్రి సితక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**













**ఇంద్రవెల్లి జులై 1(ప్రభాత సమాచారం )**
భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీకి వ్యతిరేకంగా హక్కుల సాధనకై పోరాడి ఇంద్రవెల్లి లో అమరులైన వీరుల స్తూపం వద్ద చరిత్ర ఉట్టి పడేలా స్మృతి వనం ఏర్పాటు చేయబోతున్నామని పంచాయతీ రాజ్ శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమర వీరుల స్తూపానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ గౌస్ ఆలం,ఐటీడీఎ పీఓ ఖుష్బు గుప్తా ,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్మృతి వన పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు.తధనంతరం స్మృతి వనం నమూనాను చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.అన్ని హంగులతో అమర వీరుల స్తూపాన్ని పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. పర్యాటకులతో పాటు అమరవీరులకు నివాళులు అర్పించడానికి వచ్చే ఆదివాసులకు ఆకర్షించేందుకు అన్ని రకాల మొక్కలు, చెట్లను నాటడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎకరం భూమి కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు.ఆసిఫాబాద్ జిల్లాలోని జోడెన్-ఘాట్ లో గల కొమరం భీం మ్యూజియం లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు.అన్ని సౌకర్యాలతో ఇంద్రవెల్లి అమర వీరుల స్మృతి వనం అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. త్వరలో అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. కొమరం భీం ను స్ఫూర్తిగా తీసుకోని ముందుకెళ్ళాలని సూచించారు.హైమన్ డార్ఫ్ ఆదివాసుల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రత్యేక చట్టాలు తేవడానికి కృషి చేశారని, అయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండా వర్గాల అభ్యున్నతికీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,జిల్లా సార్మేడీలు, రగల్ జెండా కమిటీ, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రెస్క్యూటీంను ఏర్పాటు చేయడం హర్షణీయం -మంత్రి సీతక్క









**ఆదిలాబాద్ జులై 1(ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా 20 మందితో (డిడిఆర్ఎఫ్) డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేయడం నిజంగా అభినందనీయమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మావల మండలం పరిధిలోని హరితనవనంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెకు ఘన స్వాగతం పలికి డీడీఆర్ఎఫ్ టీమ్ ఇన్‌చార్జి విపత్తులు సంభవించినప్పుడు చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. అనంతరం మంత్రి జిల్లా ప్రతినిధులు, ఉన్నతాధికా రులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి డీడీఆర్ఎఫ్ టీమ్ సభ్యులకు విపత్తు పరికరాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏ ప్రాంత పరిస్థితులకు అనుగుణంగా అధికార యంత్రాంగం చర్యలు ఉండాలని, సృజనాత్మకంగా ఆలోచన చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణలో ఎక్కడాలేని విధంగా స్పెషల్ రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదే స్థాయిలో సేవలందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. విపత్తులు తలెత్తినప్పుడు రంగంలోకి దిగి పరస్పర సమన్వయంతో తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మంచి పనులకు ప్రభుత్వం తరపున తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ అడవులకు పెట్టింది పేరని, గోదావరి పరివాహక ప్రాంతాలు కావడం మూలంగా వరదముప్పు పొంచి ఉంటుందన్నారు. అందువల్ల ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణకు అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేడ్మ బొజ్జు పటేల్,పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పిఓ, డిఎఫ్ఓ,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

**తారు రోడ్డు, బ్రిడ్జిని ప్రారంభించిన మంత్రి సీతక్క**

ఉట్నూర్ జులై 1(ప్రభాత సమాచారం):గ్రామాల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు సీతక్క అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని రాంలింగంపేట గ్రామం నుండి శ్యామ్ నాయక్ తండా వరకు రూ.375 లక్షల వ్యయంతో నిర్మించిన తారు రోడ్డుతో పాటు బ్రిడ్జి ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ






బొజ్జు పటేల్, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.గ్రామాలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు.పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. గ్రామాల్లో అన్ని విధాలుగా సౌకర్యాలను కల్పించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు.పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.సబ్బండ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా , ఎస్పీ గౌస్ ఆలం, ఐటిడిఎ పిఓ కుష్బు గుప్తా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ కార్యాలయం గేటుకు తాళం వేసి రైతుల ధర్నా



**జన్నారం, జులై 1 (ప్రభాత సమాచారం)**
రైతులు వడ్లమ్మిన రూ.12 లక్షలు గోల్ మాల్ అయ్యాయని సొసైటీ గేటుకు తాళం వేసి సోమవారం రైతులు ధర్నా చేశారు. అయితే రైతులు ఆ డబ్బులను ఇన్చార్జి వాడుకున్నాడని ఆరోపిస్తున్నారు. మంచిర్యాల జిల్లా పొనకల్ సింగల్ విండో సొసైటీ పరిధిలోని బాదంపల్లి, చింతలపల్లి గ్రామాలకు చెందిన మోటపలుకుల కమలాకర్, భూమన్న, లక్ష్మణ్ తో పాటు 15 మంది రైతులు ఆ సొసైటీ వద్ద కొనుగోలు కేంద్రంలో రూ.12 లక్షల వడ్లను రెండు నెలల క్రితం విక్రయించారు.ఎంతకూ రైతుల వద్ద డబ్బులు రాకపోవడంతో కార్యదర్శి రాజన్నను విచారించారు. ఆ డబ్బులు వేరే అకౌంట్ లో జమైనట్లు కార్యదర్శి చెప్పారని ఆ రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విచారణ జరిపి రైతులంతా తమ డబ్బులను ఇన్చార్జి రవి కాజేశాడని ఆరోపిస్తూ.. స్థానిక సొసైటీ కార్యాలయానికి తాళం వేసి ధర్నా చేశారు. ఆ కార్యాలయంలోనే ఉద్యోగులు ఉండిపోయారు. రైతులకు పోలీసులు ఎంత నచ్చజెప్పినప్పటికీ వినలేదు.ఈ కార్యక్రమంలో నేతలు దాసరి తిరుపతి, జనార్ధన్, ఆనందం, శ్రీనివాస్, మనోహర్ రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై సొసైటీ కార్యదర్శి కావటి రాజన్నను ప్రశ్నించగా, రైతుల డబ్బులు వాడుకున్నట్లు తమ దృష్టికి శనివారం వచ్చిందన్నారు. రైతులు తమకు ఫిర్యాదు చేసినట్లయితే డబ్బులు వారి అకౌంట్లో వేసేలాగా చూస్తామన్నారు. ఈ విషయమై ఇన్చార్జి గందొరి రవిని ప్రశ్నించగా%ా% రైతుల వద్ద డబ్బులు రూ.9 లక్షలు మాత్రమే తాను వాడుకున్నట్లు ఆయన చెప్పారు. ఆ డబ్బులు అన్నింటిని తిరిగి రైతులకు ఇస్తానని ఆయన చెప్పారు.

## దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యం: మంత్రి సీతక్క



**ఆదిలాబాద్ జులై 1(ప్రభాత సమాచారం)**
దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు.అర్హులైన ఆరుగురు దివ్యాంగులకు మూడు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లతోపాటు మరో ముగ్గురికి మూడు వాహనాలను ఆమె అందజేశారు.ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్,పాయల్ శంకర్ సైతం ఉపకారణాలను పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, పిఓ, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# వేతనం అందేదెప్పుడో!

సూర్యాపేట : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర వహిస్తున్న పంచాయతీ కార్మికులు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణుల ఆరోగ్యాలు బాగుండాలంటే పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజూ పని చేయాల్సిందే. గ్రామాల్లోని రోడ్లు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, దోమల నివారణకు చర్యలు చేపట్టడం, వంటివి పనులు చేస్తూ వ్యాధులు దరిచేరకుండా నిత్యం శ్రమిస్తున్నా.. వారికి వేతనాలు చెల్లింపులో మాత్రం ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతుండగా.. అవి కూడా ప్రతి నెల రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు నిరసన బాటపట్టారు.

నెలలుగా అందని భత్యం..

ఉమ్మడి జిల్లాలోని 1740 గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ పారిశుద్ధ్య కార్మికులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్లు, వాటర్ మెన్లు, ఇతర సిబ్బంది మొత్తం 2,578 మంది పని చేస్తున్నారు. వీరితో పాటు ఇతర సిబ్బందికి వేతనాల చెల్లింపు బకాయిలు ఒక్కో పంచాయతీల్లో ఒక్కో తీరు ఉంది. కొన్ని పంచాయతీల్లో ఏడు నెలలు, మరి కొన్నింట్లో అయిదు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. కొన్నిచోట్ల వివిధ రకాల పన్నులు వసూలు చేసి జీతాలు చెల్లిస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో పన్నుల రూపేణ డబ్బులు వచ్చినా, ఇతర పనులకు ఖర్చు అవుతుండటంతో జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్నిచోట్ల ప్రతి



నెల మంజూరయ్యే నిధుల నుంచి కార్మికులకు జీతభత్యాలు, ట్రాక్టర్ల కిస్తీలే చెల్లిస్తున్నారు.

నిధులకు నిరీక్షణ..

కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాల్లోని పనులు కుంటుపడుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూనే ఉండాలి. కాని నిధులు లేక పంచాయతీలు నిస్తేజంగా మారాయి. ఇదివరకు 15వ ఆర్థికంగా సంఘం, ఎస్ఎఫ్‌సీ నుంచి పంచాయతీలకు వచ్చేవి. ప్రస్తుతం ఆ నిధులు రాకపోవడంతో అటు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా పారిశుద్ధ్య పనులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

# సవరణ లేక.. అర్హత రాక..!

మేళ్లచెరువు : ఉమ్మడి జిల్లాలోని లబ్ధిదారులు జీరో విద్యుత్తు బిల్లు, గ్యాస్ రాయితీకి ఎదురుచూస్తున్నారు. చాలామందికి రూ.500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు వర్తించడం లేదు. సూర్యాపేట జిల్లాలోని ఒక్క మేళ్లచెరువు మండలంలో మొత్తం 13,656 దరఖాస్తులు స్వీకరించగా.. అన్నింటికీ ఆధారాలను సమర్పించారు. అందులో 698 దరఖాస్తుల్లో సమర్పించిన కార్డు(రేషన్, ఆధార్, గ్యాస్)లు, విద్యుత్ మీటరు నంబర్లు సరిపోలడం లేదు. ఒక్క మేళ్లచెరువులోనే ఈ పరిస్థితి ఉంటే ఉమ్మడి జిల్లాలో మిగతా మండలాల్లో పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. దీంతో ప్రజాపాలన సేవా కేంద్రాలకు వెళ్లిన బాధితులకు అక్కడ వాస్తవం వెల్లడవుతోంది. అర్హులైనా తమకు ప్రభుత్వం అందించే లబ్ధి చేకూరటం లేదని మదన పడుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులను మాత్రమే ప్రస్తుత ఈ- ప్రజాపాలన సేవా కేంద్రాల్లో చూడగలుగుతున్నారు. ఆధార్ లేదా రేషన్ కార్డు నంబరుతో ఓపెన్ చేసి చూసేందుకే ఇది వీలవుతుంది తప్ప.. ఆ సమయంలో దరఖాస్తుదారుడు సమర్పించిన ఆధారాల్లో నంబర్లను



ఇప్పుడు సరిదిద్దే అవకాశం(ఎడిట్ ఆప్షన్) ఇవ్వలేదు. గృహలక్ష్మి పథకం లబ్ధికి గ్యాస్(ఎల్పీజీ ఐడీ) నంబరు కచ్చితంగా నమోదు చేసిన వారికి రాయితీ నగదు రావడం లేదు. ఐడీ సరిపోలడం లేదంటూ రిమార్కు చూపుతోంది. ఇటు అధికారులు, అటు గ్యాస్ ఏజెన్సీ వారికి సమస్య అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. విషయంలోనూ దరఖాస్తుదారుడిచ్చిన మీటరు నంబరు సరిపోలడం లేదంటూ చూపుతోంది.

మేం అర్హులమా కాదా?

ముక్కపాటి రవికుమార్, మేళ్లచెరువు

నాకు ఏడేళ్ల కిందటే వివాహమైంది. మార్చిలో నా భార్య శైలజ కొత్త రేషన్ కార్డునకు దరఖాస్తు చేసింది. దాంతో పాటే మహాలక్ష్మి, గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరాం. ఏదీ రాలేదు.. మేళ్లచెరువులో ప్రజాపాలన సేవా కేంద్రంలో చూపించా. వారి అమ్మగారి రేషన్ కార్డులో నా భార్య పేరుంది. అక్కడ తొలగించకపోవటంతో అనర్హురాలని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. మాకు ఇన్నేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు. మేం ఈ పథకాలకు అర్హులమా కాదా..

ఆన్‌లైన్ అయిన వాటికి వర్తింపు..

శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేటగృహజ్యోతి పథకానికి సంబంధించి సైట్‌లో ఎడిట్ ఆప్షన్ ఓపెన్ కావటం లేదనే విషయమై మాకు సంబంధం లేదు. ప్రజాపాలన దరఖాస్తుల సవరణకు సంబంధించి పురపాలిక, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఆన్‌లైన్ వాటికి పథకం వర్తిస్తుంది. అర్హులు వెంటనే ఆన్‌లైన్ చేయించుకొని పథకాన్ని పొందాలి.

# అధికారులు అంకితభావంతో పని చేయాలి : మంత్రి సీతక్క











**ఆదిలాబాద్ జులై 1(ప్రభాత సమాచారం)**

అంకితభావంతో అధికారులు పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. అందరూ కూడా మనస్ఫూర్తిగా పనిచేసి జిల్లా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రానున్నరోజుల్లో విస్తృతంగా వర్షాలు కురిసి అనేక వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఆ పరిస్థితుల్లో ప్రాణ నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తో కలిసి నిర్వహించిన ఈ సమీక్ష సమావేశంలో అధికారులకు ఆయా శాఖల పరంగా జిల్లా ప్రజలకు అందించాల్సిన సేవలు, సమస్యల పరిష్కారం పై పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. మానవత్వంతో... తక్కువ పనిచేసి ఎక్కువ ఫలితం వచ్చేలా పని చేయాలని అన్నారు. అధికారులు తమ స్థాయిలో సమస్యలు పరిష్కరించాలని, వాటికి ప్రజా ప్రతినిధుల పై ఆధార పడకుండా సొంతంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటూనే, క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ విజిట్ చేయడం వల్ల స్థానికంగా ఉన్న సమస్యలు తెలుస్తాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలు సైతం పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, అందుకు మీ ఉద్యోగంలో అంకితభావంతో పనిచేసే మంచి గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో అనుకోని పరిస్థితులు ఏర్పడినప్పుడు కొంత ఇబ్బంది ఉన్నా వాటిని అధిగమించి ప్రజలకు సేవ చేయడం వల్ల ఎంతో గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఒక నిబంధనలకు విరుద్ధంగా పని చేయకుండా, దానికి కట్టుబడి ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడకుండా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన అధికారులుగా సమాజంలో మార్పు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం తీసుకునే కార్యక్రమాలలో భాగస్వాములై వాటిని ప్రజల దరి చేరేవిధంగా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, వాటికి పరిష్కార మార్గాలు ఆలోచించాలన్నారు. ప్రజల మన్ననలు పొందినప్పుడే మనం చేసే పనికి సంతృప్తి లభిస్తుందని, మనకూ పేరు తెచ్చిపెడుతుందని అన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల్లో మన గౌరవాన్ని మరింత రెట్టింపు చేస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల కాల వ్యవధి చాలా తక్కువని, ఇవాళ ఉన్నవాళ్లు ఐదేండ్ల తర్వాత మారవచ్చని అన్నారు. కానీ అధికారులకు మాత్రం ఒక టైం పీరియడ్ ఉంటుందని, రాజకీయ ఒత్తిళ్లకు ఎక్కడా తలొగ్గకుండా నిబద్ధతతో, నిస్వార్థంతో నిజాయితీగా పనిచేస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారన్నారు. మన పనితనంతోనే గొప్పతనం వస్తుందన్నారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా, డీ ఎఫ్ ఓ జీవన్ ప్రశాంత్ పాటిల్, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడుగంటిన పాలేరు జలాశయం



మోతె : వానాకాలం వచ్చినా.. జలాశయాలపై ఆధారపడిన మంచినీటి పథకాలకు నీటి కొరత ముంచుకొచ్చింది. కొన్ని నెలలుగా వాన జాడలేక రిజర్వాయర్లు వెలవెలబోయాయి. సూర్యాపేట, ఖమ్మం తదితర జిల్లాల్లోని వేల గ్రామాలకు నీరందించే మిషన్ భగీరథ పథకాలకు ఆయువుపట్టు అయిన పాలేరు జలాశయం రోజురోజుకూ అడుగంటుతోంది. సాగర్ నీటిపై ఆధారపడిన సూర్యాపేట-ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెం, పాలేరు గ్రామాల పరిధిలోని పాలేరు జలాశయంలో ప్రస్తుతం నీటినిల్వలు తగ్గిపోతున్నాయి. దీనిపై ఆధారపడి జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లోని సమారు 394 గ్రామాలకు నిత్యం మంచినీటి సరఫరా జరుగుతోంది. నీటి నిల్వలు తగ్గడంతో మోతె మండలంలోని 42 గ్రామాలకు మంచి నీరందించే పథకానికి రెండ్రోజులుగా నీరందడం లేదు. దీంతో మిషన్ భగీరథ పథకం పర్యవేక్షణాధికారులు జలాశయం లోపల మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు.

మోటార్లతో తరలింపు..

శుద్ధజల ప్లాంటుకు రావాటర్ అందించే ఇన్‌టేక్ వెల్‌కు నీటిని సరఫరా చేసేందుకు గురువారం జలాశయంలో నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు. జలాశయంలో నీరు అందుబాటులో ఉన్న ప్రదేశంలో ఈ మోటార్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఇన్‌టేక్‌వెల్ వరకు కందకం తవ్వి వాటి ద్వారా నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మండలానికి ఏర్పడిన నీటి కొరత జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని మండలాలకు నీరందించే ప్లాంటుకు, మరో పది రోజుల్లో రావాటర్ కొరత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. నిత్యం వేల క్యూసెక్కుల నీటిని ఈ జలాశయం నుంచి పలు జిల్లాల్లోని వేల గ్రామాలకు మంచి నీరందించేందుకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో పది రోజుల్లో జలాశయంలో నీరంతా ఖాళీ అయి మిషన్ భగీరథ పథకాలకు నీటి లభ్యత దూరం కానుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ లోపు వరుణుడు కరుణించి సూర్యాపేట, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిస్తే పాలేరు జలాశయంలోకి వరద నీరు చేరి కొరత నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. లేదంటే సాగర్ నుంచి మంచినీటి అవసరాలకు ఎడమకాల్వ ద్వారా నీటిని తరలించాల్సిన పరిస్థితి. సాగర్ అడుగంటిన నేపథ్యంలో మంచినీటి సమస్య తీవ్రం కానుంది.

మిషన్ భగీరథ పథకానికి అవసరమైన నీటికోసం జలాశయంలోని ఇన్‌టేక్ వెల్‌కు నీరు అందుబాటులో లేకపోవడంతో నాలుగు మోటార్లు ఏర్పాటు చేసి బావి వరకు తరలిస్తున్నట్లు ఏఈ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మోతె మండలానికి నీరందించే పథకానికి నీటి సమస్య వచ్చిందన్నారు.

# బాటసారి బావిని అభివృద్ధి చేయాలి: శివనాగిరెడ్డి

చౌటుప్పల్ : మండలంలోని తుప్రాన్‌పేట శివారులో నిర్మించిన బాటసారి బావిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, పురావస్తు పరిశోధకుడు డా. ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బాలంసాయి బావి అని పిలువబడే దిగుడు మెట్ల బావిని అప్పటి గోల్కొండ-మచిలీపట్నం రహదారిపై వెళ్లే బాటసారుల కోసం కుతుబ్‌షాహీల కాలం(క్రీ.శ.17వ శతాబ్ది)లో తవ్వించారని, అసఫ్‌జాహీల కాలం (19వ శతాబ్దం)లో మరమ్మతులు చేశారని కట్టడ ఆనవాళ్లు సూచిస్తున్నాయన్నారు. జాతీయ రహదారికి 100 అడుగుల దూరంలో విజయవాడ వైపు వెళ్లే వారికి కుడివైపున ఉన్న ఈ బావి 70 అడుగుల పొడువు, 45 అడుగుల వెడల్పు, 50 అడుగుల లోతుతో తవ్వించినట్లు చెప్పారు. బావి లోపలికి మెట్లు, మిగతా మూడు వైపులా రాతి గోడలు, మెట్లకు ఎదురుగా నీళ్లు తోడుకోవడానికి, వ్యవసాయ అవసరాలకి వినియోగించడానికి రాతి మోటను ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. మూడు శతాబ్దాల చరిత్ర గల దిగుడుబావి అలనాటి వాస్తు నైపుణ్యానికి అద్దం పడుతుందని, ఈ బావి చుట్టూ ఫెన్సింగ్ చారిత్రక వివరాలతో బోర్డును ఏర్పాటు చేస్తే పర్యాటక కేంద్రంగా రూపొందుతుందన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెళ్లే ప్రయాణికులను ఈ బావి ఆకర్షిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# మావల అర్బన్ పార్క్ లో వనమహోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్





**ఆదిలాబాద్ జులై 1(ప్రభాత సమాచారం)**

జిల్లాలో అటవీ విస్తీర్ణంతో పాటు పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతి రాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా మావల అర్బన్ పార్క్ లో వనమహోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులతో కలిసి పార్కులో మొక్కలు నాటి కార్య క్రమాన్ని ప్రారంభించారు. పార్క్ లోని మ్యూజియంను సందర్శించారు. వ్యూపాయింట్ పై కెక్కి పార్క్ అందాలను పరిశీలించారు. సఫారీ కారులో పార్కంతా తిరిగి పరిశీలించారు. జిల్లాలో ఈ వానాకాల సీజన్ లో 29 ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసి మొత్తం 44 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. వర్షఋతువులో కురిసే వర్షాల కనుగుణంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో ఈ మొత్తం మొక్కలు నాటేలా అధికారులను ఆదేశించారు. జిల్లాలో 29 శాఖల ఆధ్వర్యంలో 468 గ్రామ పంచాయతీలతో పాటు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటనున్నట్టు వివరించారు.

# నమూనాల సేకరణ.. ఫలితాల విస్మరణ

జిన్నారం: కాలుష్యాన్ని కట్టడి చేయాల్సిన పీసీబీ అధికారులు, సిబ్బంది తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాలు కురిసినపుడు పలు పరిశ్రమలు కాలుష్య జలాలను వరదలోకి వదులుతున్నాయి. ఆ జలాలు స్థానిక చెరువుల్లో చేరుతున్నాయి. రసాయన వ్యర్థాల ఘాటు వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ప్రజలు ఈ విషయాన్ని ఫిర్యాదు చేస్తే.. పీసీబీ అధికారులు సిబ్బందితో వచ్చి జలాల నమూనాలను తీసుకెళుతున్నారు. ఫలితాలు వెల్లడించడం లేదని, కారక పరిశ్రమల పై ఎలాంటి చర్యలు ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నిబంధనలిలా..: నమూనాల ఫలితాల నివేదికను పీసీబీ అధికారులు ఫిర్యాదుదారుకు విధిగా అందజేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి పారిశ్రామికవాడల్లోని చెరువులు, కుంటలు, బోర్ల నుంచి నమూనాలు సేకరించారు. నివేదికను స్థానిక పంచాయతీ కార్యాయలంతో పాటు మండల పరిషత్‌లో అందుబాటులో ఉంచాలి. కాలుష్యం పెరుగుతున్నట్లు తేలితే.. సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. కాలుష్య కట్టడికి కఠినంగా వ్యవహరించాలి.

ఇవిగో ఉదాహరణలు

గతేడాది వేసవిలో ఖాజీపల్లి అటవీ ప్రాంతానికి సమీపంలోని దుండిగల్ శివారులో ప్రమాదకర రసాయనాల డ్రమ్ములు వంద వరకు పడేశారు. అక్కడి నుంచి కాలుష్య జలాలు ఖాజీపల్లి వరకు పారాయి. ఘాటు వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సమస్యపై అప్పటి సర్పంచి సత్యనారాయణ పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి నమూనాలు సేకరించారు. ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు.

ఖాజీపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద కాలుష్య జలాల నమూనాలు తీసుకున్న పీసీబీ అధికారులు.. ఫలితం తేల్చకుండానే మిన్నకుండటంపై విమర్శలొచ్చాయి. గొల్లగూడెం వద్ద కూడా ఇలాగే వ్యవహరించారు.

చర్యలు తీసుకుంటున్నాంకాలుష్య కట్టడి విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. నమూనాల రిపోర్టు వెంటనే కావాలని కోరిన వారికి అందజేస్తున్నాం. కార్యాలయాల్లో అందుబాటులో ఉంచడం లేదు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తాం. కుమార్ పాఠక్, పీసీబీ ఈఈ, రామచంద్రాపురం

# చెత్త రిక్షాలపై పట్టింపేది!

పాన్నపేట : మనంవాడే ఏ వస్తువైనా క్రమం తప్పకుండా వినియోగి స్తేనే మనుగడలో ఉంటుంది. వాడకుండా వదిలేస్తే పనికిరాకుండా పోతుంది. ఇదే పరిస్థితి పంచాయతీ రిక్షాలకు కూడా వర్తిస్తుంది. చెత్త సేకరణకు అందజేసిన రిక్షాలు నిరుపయోగంగా దర్శనమిస్తు న్నాయి. ఓ మూలన పడేయడంతో తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 469 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కింద ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించేలా కేంద్ర ప్రభుత్వం 2016లో రిక్షాలను పంపిణీ చేసింది. అప్పట్లో కార్మికులు ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరిస్తూ డంపింగ్‌యార్డులకు తరలించారు. 2019లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం కింద ప్రతి పంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. అప్పట్నుంచి దానిని వినియోగించి రిక్షాలను పక్కనపెట్టారు. అధికారులు కూడా దీని గురించి పట్టించుకోవడం మానేశారు. నిర్వహణ భారంగా మారినా..నిధుల కొరతతో పంచాయతీల నిర్వహణ భారంగా మారుతున్నా పాలకవర్గాలు ట్రాక్టర్ల వినియోగం వైపు మొగ్గుచూపాయి. ఇంధన ఖర్చు లేకుండా చెత్తను సేకరించే రిక్షాలను పట్టించుకోలేదు. దీంతో గత ఎనిమిదేళ్లుగా అవి అలంకారప్రాయంగా మారాయి. నిధులు వృథా అయ్యాయి. ప్రస్తుతం వీటికి కొద్ది పాటి మరమ్మతులు చేయిస్తే ట్రాక్టర్లు వెళ్లలేని చిన్నవీధుల్లోకి తీసుకెళ్లవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నా సభ్యత్వాన్ని రద్దు చేయమని ఎలా అంటారు..?



హైదరాబాద్: బీజేపీఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన సభ్యత్వం రద్దు చేయమని అడిగే అధికారం ఆయనకు లేదన్నారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీ నుంచి విజయం సాధించి, కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మహేశ్వర రెడ్డి ఈ రోజు కలిశారు. పార్టీ మారిన దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. ఇదే అంశంపై దానం నాగేందర్ మాట్లాడుతూ.. తన సభ్యత్వం గురించి మాట్లాడే హక్కు మహేశ్వర రెడ్డికి లేదన్నారు. ఏ హోదాతో తన సభ్యత్వం రద్దు గురించి అడిగారని ప్రశ్నించారు. పార్టీ మారడం అనే విషయం దేశంలో కొత్త కాదని గుర్తుచేశారు. తన సభ్యత్వం గురించి హైకోర్టులో కేసు ఉందని గుర్తుచేశారు.

**అంతర్గత ఒప్పందం :** ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ-బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం జరిగిందని దానం నాగేందర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీతో బీజేపీకి ఒప్పందం ఉందని.. అందుకే ఆ మాత్రం సీట్లు గెలిచిందన్నారు. లేదంటే రెండు సీట్లు కూడా రావని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ 8 లోక్ సభ సీట్లు గెలిచింది. గతంలో 4 గెలువగా.. ఈ సారి రెట్టింపు స్థానాలను కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీతో అంతర్గత ఒప్పందం వల్లే ఆ పార్టీకి అన్ని సీట్లు వచ్చాయని పేర్కొంది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజార్టీతో ఉంది. మరి తమ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్, బీజేపీ పడగొడతాయని అంటున్నాయి.. ఎలా సర్కార్‌ను కూలుస్తారని నిలదీశారు. దీనిని బట్టి ఆ రెండు పార్టీలు ఒక్కటేనని అర్థం అయ్యిందని వివరించారు.

# నల్గొండ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..



నల్గొండ, జూలై 1: నల్గొండ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని... పేదవాడికి అండగా ఉంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద రూ.3 కోట్లతో నిర్మించనున్న 33/11 కెవీ సబ్ స్టేషన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్గొండ టౌన్‌ను మోడల్గా తీర్చిదిద్దుతామన్నారు.

రూ.700 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నామని.. ఎవరికీ నష్టం చేయమని తెలిపారు. తనకు ఐదు గజాల భూమి లేదని... ఇంకా అద్దె ఇంట్లోనే ఉంటున్నానని చెప్పారు. మార్కెట్ ధర కన్నా ఎక్కువ నష్టపరిహారం ఇస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ సెంటర్ వద్ద అన్ని వసతులతో మల్టీపర్పస్ హాస్టల్ కట్టనున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రభుత్వాధికారులకు ఆదేశించామని.. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన తీసివేయాలని ఆదేశించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.




హైదరాబాద్: ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి థర్డ్ పార్టీ యాప్స్‌ను ఉపయోగించి విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారా? అయితే ఈ నెల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపులు చేయడం సాధ్యపడదు. క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపుల తరహాలోనే ఆయా యాప్స్ ఈ సేవలనూ నిలిపి వేయడమే కారణం. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తమ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లోనే బిల్లుల చెల్లింపులు చేయాలని వినియోగదారులకు సూచించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి జులై 1 నుంచి ఆయా చెల్లింపు సంస్థలు %u+ూ్రాణజూ% విద్యుత్ బిల్లులు చెల్లింపులను నిలిపివేశాయని ఎక్స్ ద్వారా తెలిపింది. ఒక్క దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర డిస్కమ్‌లదీ అదే పరిస్థితి. TGNPDCL, APSPDCL, APEPDCL, APCPDCL పరిధిలోని బిల్లులు చెల్లించాలని ప్రయత్నించినప్పుడు భారత్ బిల్లు పేమెంట్ సిస్టమ్‌కు రిజిస్టర్ కాలేదని చూపిస్తోంది. దీనివల్ల పెద్ద సంఖ్యలో వినియోగదారులపై ప్రభావం పడనుంది. దీంతో ఆయా విద్యుత్ పంపిణీ సంస్థల పరిధిలోని వినియోగదారులు డిస్కమ్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌ను ఆశ్రయించాల్సిందే.

**ఆర్‌బీఐ ఏం చెప్పింది? :** బిల్లు చెల్లింపుల్లో సమర్థత, భద్రతకు పెద్ద పీట వేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. బిల్లు చెల్లింపులన్నీ భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ ద్వారానే జరగాలని నిర్దేశించింది. జులై 1 నుంచి కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్‌ను బిల్లర్లు ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రైవేటు బ్యాంకులకు సంబంధించి హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు ఈ పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోలేదు. దీంతో ఫోన్ పే, క్రెడ్ వంటి కంపెనీలు కస్టమర్ల క్రెడిట్ కార్డుల బిల్లులను ప్రాసెస్ చేయలేవు. దీనివల్ల ఆయా యాప్స్‌లో క్రెడిట్ కార్డు బిల్లుల చెల్లింపు వీలు పడదు. ఇప్పుడు విద్యుత్ బిల్లుల చెల్లింపుల విషయంలోనూ అదే జరిగింది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# దిల్లీ హైకోర్టులో కవితకు నిరాశ.. బెయిల్ పిటిషన్లు తిరస్కరణ

దిల్లీ: భారాస ఎమ్మెల్సీ కవితకు దిల్లీ హైకోర్టులో నిరాశ ఎదురైంది. దిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆమె బెయిల్ కోరుతూ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను దిల్లీ ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ తనపై నమోదు చేసిన కేసుల్లో బెయిల్ మంజూరు చేయాలంటూ ఆమె దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మద్యం కేసులో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో మార్చి 15న ఈడీ అధికారులు కవితను అరెస్టు చేసి దిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. వారం రోజుల ఈడీ కస్టడీ అనంతరం జ్యుడీషియల్ కస్టడీకి తరలించాక.. ఏప్రిల్‌లో విచారణ సందర్భంగా సీబీఐ రెండు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించింది. ఆ తర్వాత ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించింది.

తర్వాత ఆమెను కోర్టులో హాజరు పరచగా.. 14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉంటున్నారు. దీంతో తనపై సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులపై బెయిల్ కోరుతూ గతంలో రెండు వేర్వేరు పిటిషన్లను దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కవిత దాఖలు చేయగా.. విచారించిన ఆ న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులను ఆమె దిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. కవితను నిరాధార ఆరోపణలతో అరెస్టు చేశారని, ఒక పార్టీకి కీలక నేతగా ఉన్నా ఆమెకు ఎలాంటి అవకాశాలు కల్పించకుండా ఉంచారంటూ ఆరోపిస్తూ ఆమె తరఫు న్యాయవాదులు వాదించారు. ఈడీ, సీబీఐ తరఫున వాదనలు వినిపిస్తూ.. దిల్లీ మద్యం కేసులో కవిత కీలక పాత్రధారి, సూత్రధారి అని కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం దిల్లీ మద్యం కేసు కీలక దశలో కొనసాగుతున్న తరుణంలో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని వాదించారు. అందువల్ల ఎట్టిపరిస్థితుల్లో ఆమెకు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. సీబీఐ, ఈడీ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న కోర్టు కవిత పిటిషన్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# త్వరలో క్యాబినెట్ విస్తరణ.. సీతక్కకు హోంశాఖ దక్కే ఛాన్స్: దామోదర రాజనర్సింహ

హైదరాబాద్: త్వరలో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. సోమవారం విలేకర్లతో చిట్‌చాట్ సందర్భంగా పలు కీలక అంశాలు వెల్లడించారు. క్యాబినెట్ విస్తరణతో పాటు పలువురు మంత్రుల శాఖల్లోనూ మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. కొత్తగా ఐదారుగురికి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మంత్రి సీతక్కకు హోం మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందన్నారు.

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దానం నాగేందర్‌కు క్యాబినెట్‌లో చోటు దక్కే అవకాశం ఉందని రాజనర్సింహ వ్యాఖ్యానించారు. నిజామాబాద్ నుంచి ఒకరికి క్యాబినెట్‌లో చోటు దక్కొచ్చని తెలిపారు. త్వరలోనే వైద్యశాఖలో ప్రక్షాళన చేపడతామన్నారు.



# క్యాన్సర్ బాధిత బాలుడికి అండగా నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి..



హైదరాబాద్: వరంగల్ పర్యటనకు వెళ్లిన తనను కలవలేకపోయిన క్యాన్సర్ బాధిత బాలుడు మహమ్మద్ అదిల్ అహ్మద్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తక్షణమే వైద్య సహాయం అందించాలని సీఎంవో అధికారులను ఆయన ఆదేశించారు. జూన్ 29న వరంగల్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లగా ఆయన్ను కలవకుండా బాలుడి కుటుంబాన్ని భద్రతా సిబ్బంది ఆపేశారు. విషయం తెలుసుకున్న సీఎం బాలుణ్ని ఆదుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఓఎస్డీ వేముల శ్రీనివాస్ బాలుడి కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. నెల రోజుల క్రితం అదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల ఎల్వోసీ మంజూరు చేసింది. ప్రస్తుతం అదిల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాస్ ఆరా తీశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మరింత సాయం అందిస్తామని అదిల్ కుటుంబ సభ్యులకు ఆయన భరోసా ఇచ్చారు.


# పదవులు ఎవరికీ శాశ్వతం కాదు.. హరీశ్‌రావు షాకింగ్ కామెంట్స్



సిద్దిపేట జిల్లా: పదవులు ఎవరికీ శాశ్వతం కాదు, ఎవరైనా మాజీలు కావాల్సిందేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈరోజు(సోమవారం) చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు కీసరి పాపయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హరీష్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పాల్గొన్నారు. ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటామని... కానీ సాగునీరు జీవన ఆధారమని తెలిపారు. జీవన గతిని, పల్లెల ముఖ చిత్రాన్ని మార్చేది సాగునీరు మాత్రమేనని అన్నారు. అభివృద్ధి అక్కడితో ఆగదని, ఎంత చేసుకున్నా ఎంతో కొంత మిగిలే ఉంటుందని.. ఇంకా పనులు మిగిలే ఉంటాయని చెప్పారు. పదవుల్లో ఉన్నపుడు ఎన్ని మంచి పనులు చేశామనేదే శాశ్వతంగా నిలిచిపోతుందని తెలిపారు. మళ్లీ ఇంకా మంచి అవకాశాలు రావాలని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలని అన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా తన సహకారం ఎప్పటికి ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మరికొంతమంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ ఆదేశాలు..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో 8మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు జరగగా.. తాజా మరికొంత మందిని ట్రాన్స్‌ఫర్ చేశారు. కొత్తగూడెం ఓఎస్‌డీగా పరితోశ్ పంకజ్, ములుగు ఓఎస్‌డీగా గీతే మహేశ్ బాబా సాహెబ్, గవర్నర్ ఓఎస్‌డీగా సిరిశెట్టి సంకీర్త్ నియమితులయ్యారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా కాంతిలాల్ సుభాశ్, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రిని రెడ్డి, భద్రాచలం ఏఎస్పీగా అంకిత్ కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీగా శివం ఉపాధ్యాయ, భైంసా ఏఎస్పీగా అవినాశ్ కుమార్‌ను నియమిస్తూ సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు జారీ చేశారు. గత నెలలోనూ పలు జిల్లాలకు కొత్త ఎస్పీలు, పలుజోన్లకు డీసీపీలను బదిలీ చేసిన సంగతి తెలిసిందే.




# తెలంగాణలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు రంగం సిద్ధం..




హైదరాబాద్: తెలంగాణలో ఆగస్టు 15 సందర్భంగా సత్ప్రవర్తన సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పచ్చజెండా ఊపారు. దీంతో 231మంది ఖైదీల విడుదలకు మార్గం సుగమం అయ్యింది. ఈ మేరకు మూడ్రోజుల కిందట పంపించిన లిస్టుకు ఆయన ఆమోదం తెలిపారు.

గవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యి సుమారు రెండు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు, ఆగస్టు 15న ఖైదీల విడుదల, యూనివర్సిటీల్లో వీసీల నియామకం, రాష్ట్ర విభజన అంశాలపై గవర్నర్, సీఎం మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఖైదీలను విడుదల చేసేందుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. దీంతో ఏళ్ల తరబడి జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న 231మంది విడుదల కానున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 161ప్రకారం ఖైదీలకు క్షమాభిక్ష, శిక్షల నుంచి ఉపశమనం కల్పించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660